క్లుప్తంగా

ఫ్లెక్సీలతో ఎన్నికలపై అవగాహన



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లు ఆకర్షణీయంగా మారాయి. రాజీవ్‌చౌక్, కొత్త బస్టాండ్, కొత్తకోట రోడ్డులో సుమారు రూ. 3లక్షలతో ప్రైవేట్ ఏజెన్సీ సహకారంతో పురపాలక సంఘం భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేసింది. వారం రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఈ హోర్డింగ్‌లపై సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జరిగే కార్యకలాపాలను యాప్‌లో పొందుపరిచే విషయంతో పాటుగా, కచ్చితంగా నవంబర్ 30న నేను ఓటు వేస్తాను అని ఇరువైపులా హోర్డింగ్‌ల చుట్టూ ఫ్లెక్సీలు కలెక్టర్, ఎన్నికల అధికారి పేరుతో ఏర్పాటు చేశారు. ఈ హోర్డింగ్‌లు భారీ స్థాయిలో ఉండటం, వీటిపై సీ విజిల్ యాప్ అవగాహన కలిగించడంతో పాటుగా, ఓటర్లకు ఓటింగ్ పై విస్తృత ప్రచారం కల్పించేందుకు దోహదం పడుతున్నాయి.

తుల్జాభవానీ ఉత్సవాలు



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గిరిజనుల ఆరాధ్య దైవం తుల్జాభవాని (పోషమ్మ) దేవత ఉత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. తండాలోని గిరిజనులంతా ప్రతి ఇంటి వద్ద ప్రత్యేకంగా బట్టతో తయారు చేసిన మండపంలో అమ్మవారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధాన్యం బస్తాలు, పలు రకాల పూలతో అమ్మవారిని అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తండాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు, సౌండ్‌బాక్సులు, గిరిజనుల నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది. తుల్జాభవానీ దేవతతో తండాలో గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. ఈ పండుగ మూడు రోజుల పాటు నిర్వహిస్తారని గిరిజనులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు బాల్యానాయక్, బాబునాయక్, గోపాల్‌నాయక్, రాజునాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి సహకరించాలి



పాన్‌గల్: ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలకు వచ్చే పోలింగ్ సిబ్బందికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ తమ తోడ్పాటునందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, భోజన వసతి వంటి వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కార్యదర్శులు చూసుకోవాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని, అన్ని జీపీలల్లోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు కొత్తపేటలోని నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను ఆయన పరిశీలించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

వీపనగండ్ల: దివ్యాంగులు సీనియర్ సిటిజన్ వినియోగించుకోనున్న పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులు మంగళవారం గోపల్‌దిన్నె, కల్వరాల, సంగినేనిపల్లి, వీపనగండ్ల, బొల్లారం తదితర గ్రామాల్లో అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం ఉమ్మడి చిన్నంబావి, వీపనగండ్ల, పాన్‌గల్ మండలాల్లో ఎన్నికల ప్రత్యేక అధికారి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. వీపనగండ్ల మండలంలో 18 మంది, చిన్నంబావిలో 12 మంది, పాన్‌గల్‌లో ముగ్గురు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మైక్రోఅబ్జర్వర్ ప్రవీణ్, పంచాయతీ సెక్రెటరీ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్రాన్ని ఢీకొట్టిన లారీ

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం లారీ ఢీకొట్టడంతో గుర్రం తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. కొన్నాళ్ల నుంచి ఓ గుర్రం అడ్డాకుల పరిసరాల్లో సంచరిస్తోంది. ఈక్రమంలో కర్నూల్ వైపు వెళ్లే రోడ్డును దాటుతున్న గుర్రాన్ని లారీ ఢీకొట్టడంతో అది తీవ్రంగా గాయపడింది. మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్‌ఖన్నకు సమాచారం ఇవ్వడంతో ఆయన వైద్య సిబ్బందిని పంపించారు. దానికి చికిత్స చేయించి యంత్రాల సాయంతో రోడ్డు నుంచి కొంత దూరం తీసుకెళ్లి చెట్టు కింద వదిలేశారు.

భవిష్యత్ తరాల కోసమే అభివృద్ధి



శాఖాపురంలో మహిళలకు నమస్కరిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అభివృద్ధిని చేశానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని రంగాపురం, రాంపురం, రామమ్మపేట, తోమాలపల్లి, వై.శాఖాపూర్ గ్రామాల్లో ఇంటికీ తిరుగుతూ రాష్ట్రప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు, తర్వాత మారిన పరిస్థితులు మీకళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో అధికారంలో ఉందని, అక్కడ ఏమి చేయలేదని విమర్శించారు. కానీ ఇక్కడ వచ్చి మేము అభివృద్ధి చేస్తాం అని చెబితే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను, నిరంజన్‌రెడ్డిని తిడితే ఓట్లు పడవని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి, వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వనం రాములు, గౌని బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి, కుమార్తెలు డాక్టర్ ప్రత్యూష, తేజశ్విని అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మామిడిమాడ, పర్వతాపురం గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, నాయకులు లక్ష్మారెడ్డి, సామ్యనాయక్, రాళ్లకృష్ణయ్య పాల్గొన్నారు.



కమాలోద్దీన్‌పూర్‌లో..



రాంపురంలో పర్యటిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం



మక్తల్‌లో అభివాదం చేస్తున్న వాకిటి శ్రీహరి

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, ప్రతి ఇంట్లో సౌభాగ్యం వెల్లివిరుస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ఊట్కూర్ మండలంలోని పులిమామిడి సర్పంచ్ చిన్న సూరయ్యగౌడ్, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇతర పార్టీల నుంచి ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరి కాంగ్రెస్ కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి, తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మక్తల్ పట్టణంలో వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, పెద్ద సూరయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, సిద్దార్థరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి మైనార్టీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి మైనార్టీ నాయకులు కాంగ్రెస్ చేరారు. కార్యక్రమంలో ముస్తాక్‌మాలిక్, ఎండీ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.500లకే సిలిండర్

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లో రేచింతల సర్పంచ్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని ఆరు గ్యారెంటీలను అమలు చెయ్యడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రహ్మతుల్లా, విజయలక్ష్మి, గంగాధర్, వెంకటన్న, అజ్మత్, జుబేర్, రామకృష్ణ, ఈర్లదిన్నె శ్రీను తదితరులు ఉన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

ఆత్మకూర్: మండల మహిళా సమాఖ్య, ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఖూలమల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీసీ అన్వర్‌పాష ప్రారంభించారు. గ్రేడ్ 1 రకానికి మద్దతు ధర రూ.2,203, గ్రేడ్ 2 ధాన్యానికి రూ.2, 183 ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు తమ పంటలను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా నేరుగా ఇక్కడ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు సులోచనమ్మ, గాయత్రి, కార్యాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామాల్లో వరి సాగు చేసిన రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఏపీఎం బిచ్చన్న, సీసీ వీరయ్య అన్నారు. మంగళవారం గోవర్ధనగిరిలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,203, బి గ్రేడ్ ధ్యాన్యానికి రూ.2,183 ప్రభుత్వ మద్దతు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు శ్రీలత, దేవమ్మ, బుక్‌కీపర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం తగదు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం సేకరణలో జాప్యం చేయడం తగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి అన్నారు. మంగళవారం తెల్లరాళ్లపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించి సమస్యలపై రైతులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తేమ శాతం పేరుతో కొనుగోలులో జాప్యం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు వాతావరణంలో మార్పులతో అకాల వర్షాలు సంభవిస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధాన్యం తడవకుండా కప్పేందుకు టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ, కవర్లను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద హన్మంతు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలాచరించారు. అనంతరం శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకొని ధ్వజ స్తంభాల ముందు, నది దగ్గర భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష



కొల్లాపూర్‌లో పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రూ.400 వంటగ్యాస్ సిలిండర్, రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ, పేదలు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జీఎం నజీర్, చిక్కేపల్లికి చెందిన తెల్గు శ్రీను, తెల్గు బాలస్వామి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రంగినేని అభిలాష్‌రావు, సుధాకర్‌యాదవ్, చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్ పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని పస్పులకు చెందిన స్వామి, రంగస్వామి, చంద్రయ్య, వార్డు సభ్యుడు కృష్ణయ్యతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లిలో బీరం విజయమ్మ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, నర్సింహ, బిచ్చిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు భూంరెడ్డి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్‌లో ఎమ్మెల్యేగా మరోసారి హర్షవర్ధన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాంభూపాల్‌రెడ్డి, రాజేష్, శేషేంద్రప్రసాద్, మతీన్, కుమార్‌లు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీరం విజయమ్మ



పాన్‌గల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

బీజేపీతోనే సంక్షేమం సాధ్యం



మాట్లాడుతున్న కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి, కొండయ్య తదితరులు

మక్తల్: బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కర్నాటక రాష్ట్రంలోని కోలార్ ఎంపీ మునిస్వామి అన్నారు. మంగళవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ మక్తల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, శ్రేణులు వేలాదిగా తరలిరావాలని కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాడుతుందన్నారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, కర్నిస్వామి, ద్యావరింటి నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, సోమశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో..

మండలంలోని మల్లేపల్లిలో మంగళవారం సాయంత్రం బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు.

ఉచితంగా 4 సిలిండర్లు

ఆత్మకూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి ఉచితంగా నాలుగు సిలిండర్లు, అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, ఆనంద్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కొండపురం రాము, కుర్ని ఉదయ్ తదితరులు ఉన్నారు.



మల్లెపల్లిల్లో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

అమరచింత: నియోజక వర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వమని మక్తల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి కోరారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, మేర్వరాజు, అశోక్, నారాయణ, వెంకటేశ్వర్లు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నరాల నారాయణ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

జలంధర్‌రెడ్డి సమక్షంలో మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామాలు చేసి బీజేపీలో చేరారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో ఒరిగిందేమీలేదు



కొల్లాపూర్‌లో బీజేపీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు



రేకులపల్లి తండాలోప్రచారం చేస్తున్న ఎల్లేని కూతురు తేజశ్రీ

కొల్లాపూర్/కోడేరు: ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జూపల్లి కృష్ణారావు, ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి లతో నియోజకవర్గానికి చేసిందేమీలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. మంగళవారం బెక్కెం, నాగర్లబండ తండాకు చెందిన పలువురు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎల్లేని సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ మంత్రి జూపల్లి ఏ మోహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కొల్లాపూర్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేష్‌నాయక్, రవినాయక్, శంకర్, వెంకటేష్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే కష్టాలే



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: పుట్టిన బిడ్డ తల్లి దగ్గర ఉండడం ఎంత సురక్షితమో...తెచ్చుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ చేతిలో ఉండటం కూడా అంతే సురక్షితమని.. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల, తిమ్మాయిపల్లి తండా, తిమ్మాయిపల్లి, గుడిబండ, శాఖాపూర్‌లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే కష్టాలు తప్పవన్నారు. రాష్ట్రం బాగుపడుతుంటే కళ్లు మండుతున్నాయని విమర్శించారు. వివిధ పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, ప్రదీప్‌కుమార్‌గౌడ్, బాలమణెమ్మ, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం, కమాలోద్దీన్‌పూర్ గ్రామాల్లో మంగళవారం స్థానిక ఎస్‌ఐ శ్రీహరి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్నందున ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటుగా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు గ్రామాల్లో కూడా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేయాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన వెంకటన్న అనుమతులు లేకుండా తన షాపులో మద్యాన్ని విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం తెలియడంతో మంగళవారం పోలీసులు తనిఖీ చేసి 4.1 లీటర్ల మద్యం పట్టుకున్నారు.